'మరణ సందేశం' పుస్తకావిష్కరణ | ముఖ్యఅతిథిగా హాజరైన కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్



2లో..



# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 190 | సోమవారం | 29 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# ఫిరాయింపుల ఫీవర్...?




**2018 సీన్ రిపీట్**

**సీఎంతో భేటీ అవుతున్న ఎమ్మెల్యేలు, నాయకులు**

**కాంగ్రెస్‌లో చేరుతారంటూ ప్రచారం**

**కేటీఆర్ తీరుపై సొంత పార్టీ నేతల అసహనం**



తెలంగాణలో 2018లో జరిగిన సీన్ రిపీట్ కానుందా.. బీఆర్ఎస్‌కు ఫిరాయింపుల ఫీవర్ పట్టుకుందా.. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ లో చేరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్యూ కడుతున్నారా.. అంటే అవుననే సమాధానమే వస్తోంది. అయితే అప్పటికీ ఇప్పటికీ ఒక మార్పు మాత్రం కచ్చితంగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న నియంతృత్వ పోకడలతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి చేర్చుకోగా ఇప్పుడు అందుకు భిన్నంగా ఎమ్మెల్యేలే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వరుస కడుతున్నారన్న ప్రచారం సాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా ఆత్మ పరిశీలన చేసుకోకుండా బజారు రాజకీయ నాయకుడిని మించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యవహరించడంపై సొంత పార్టీ నేతలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పార్టీ మనుగడ కష్టమేనంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ కావడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. వారంతా త్వరలోనే పార్టీ మారుతారన్న ప్రచారం ఊపందుకుంది.

- వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో..

## పార్టీని కాపాడుకుంటాం..

కేసీఆర్ వచ్చాకే తెలంగాణలో అభివృద్ధి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మరో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



2 లో..

## కేటీఆర్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలి

సీఎం రేవంత్‌కు టీపీసీసీ నేత బండి సుధాకర్ గౌడ్ వినతి



8లో..

## మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలి

సమ్మక్క, సారమ్మలను తీసుకొచ్చే సమయంలో ఇబ్బందులు

మేడారంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పూజారుల విజ్ఞప్తి

# ఫిరాయింపుల.. ఫీవర్..?






**2018 సీన్ రిపీట్**

**సీఎంతో భేటీ అవుతున్న ఎమ్మెల్యేలు, నాయకులు**

**కాంగ్రెస్‌లో చేరుతారంటూ ప్రచారం**

**కేటీఆర్ తీరుపై సొంత పార్టీ నేతల అసహనం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ ఎస్ కు ఫిరాయింపుల ఫీవర్ పట్టుకుంది. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వారు క్యూ కడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే బీఆర్ ఎస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కాగా తాజాగా మరో ఎమ్మెల్యే మిలాఖత్ కావడం చర్చనీయాంశంగా మారింది. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చూపు కాంగ్రెస్ పార్టీ వైపు ఉందన్న ప్రచారం ఊపందుకుంది. ఒక్కొక్కరుగా పార్టీ వీడేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోకుండా కన్నూమిన్నూ గానక మాట్లాడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తీరు దారుణంగా ఉంది. బజారు రాజకీయ నాయకుడి కన్నా దారుణంగా ఆయన మాట్లాడడాన్ని సొంత పార్టీ నేతలు సైతం



తప్పుపడుతున్నారు. ఆయన తన వైఖరి మార్చుకోకుంటే ప్రజలు మరోమారు గుణపాఠం చెప్పక తప్పదంటున్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, కేటీఆర్ అహంకారమే పార్టీ పుట్టి మునిగేందుకు కారణమైందంటున్నారు.

### నియంతృత్వ పోకడలే..

గత ప్రభుత్వంలో చాలా మంది ఎమ్మెల్యలే, మాజీ ఎమ్మెల్యేలు బినామీ కాంట్రాక్టర్లుగా మారి కోట్ల విలువ చేసే వివిధ పనులను పూర్తి చేశారు. వీరి బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్ లో ఉన్నాయి. వీరు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటే వారి బిల్లులు మంజూరుకావని భావిస్తున్న వారు తమ అవసరాలను గట్టెంకించుకునేందుకు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే అనేమ మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అధికార పార్టీ నేతలతో టచ్ లో ఉంటున్నారు. కేసీఆర్ గత పది ఏళ్ల పాలనలో చేసింది ఏమీ లేదని, తండ్రి కొడుకుల నియంతృత్వ పోకడలతోనే తామంతా అధికారం కోల్పోయామన్న భావన చాలామంది మాజీ ఎమ్మెల్యేల్లో ఉంది. మేయర్లు, మున్సిపల్ చైర్మన్ లు కూడా తమ పదవులను రక్షించుకునేందుకు అధికార పార్టీతో చేతులు కదుపుతున్నారు. ఇప్పటికే చాలామంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు హస్తగతం కాబోతున్నట్లు ప్రచారం సాగుతోంది.

### బీఆర్ఎస్ గల్లంతే..

కేటీఆర్ నోటి దురుసే ఇప్పుడు ఆ పార్టీకి పుట్టగతలు లేకుండా చేస్తోందన్న ప్రచారం సాగుతోంది. పార్లమెంట్ ఎన్నికలలోపు బీఆర్ ఎస్ ను మరింత బలహీనపరిచేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతోపాటు బీజేపీకూడా పావులు కదుపుతోందంటు గుసగుసలు వినిపిస్తున్నాయి. బీఆర్ ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాలపాటు తమకు ఎదురే లేదన్న అహంకారంతో అటు కాంగ్రెస్ పార్టీని, ఇటు బీజేపీ నేతలను మాటలతో చీల్చి చండాడడంపై వారు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ ఎస్ పార్టీని తిరిగి కోలుకోకుండా చేయాలన్న కృత నిశ్చయంతో రెండు జాతీయ పార్టీలు ముందుకు సాగుతున్నట్లు సమాచారం. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ ఎస్ ను మట్టికరిపించి ఆ పార్టీ అడ్రస్ గల్లంతు చేసేలా వ్యూహ రచన చేస్తున్నారు.

### సీన్ రిపీట్..

2018లో బీఆర్ ఎస్ పార్టీ చాలినంత మెజార్టీ ఉన్నప్పటికీ రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న నియంతృత్వ పోకడలతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి 12 మందిని వారి పార్టీలో చేర్చుకున్నారు. ఇదే సీన్ ఇప్పుడు రాష్ట్రంలో కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ స్వల్ప మెజార్టీతో అధికారం చేపట్టిన నేపథ్యంలో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నం చేస్తుందన్న ప్రచారం సాగుతోంది. లోక్ సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారుతాయనే అంచనాల నేపథ్యంలో.. ఈ లోగా చేరికల వ్యూహాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెప్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే పలువురు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

### నేతల కదలికలపై కన్ను..

ఈ పరిణామాలతో అప్రమత్తమైన బీఆర్ఎస్ పెద్దలు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర కీలక నేతల కదలికపై కన్నేశారు. అయినా కూడా పవర్ పార్టీ వైపు చాలామంది ముగ్గు చూపుతున్నారు. తమ రాజకీయ భవిష్యత్తు, నియోజకవర్గ అవసరాలు ఉన్నాయంటూ సీఎంను వరుసగా కలుస్తుండడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పదవుల రక్షణతో పాటు అధికార పార్టీ ప్రవేశపెట్టే అవిశ్వాసాల నుంచి గట్టెక్కేందుకు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

### సీఎంతో భేటీ..

గత మంగళవారం నలుగురు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, మాణిక్ రావులు ఒక్కటిగా వెళ్లి సీఎంతో భేటీ అయ్యారు. ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమవడంతో.. తెల్లారి ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు. తమకు సెక్యూరిటీ పెంపు, నియోజకవర్గాల అభివృద్ధి పనులపై చర్చించామని సంజాయిషీ చెప్పుకున్నారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం వందసార్లు అయినా ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. తాజాగా ఈ జాబితాలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కూడా చేరారు. వీరే కాకుండా మరికొందరు బీఆర్ ఎస్ నేతలు కూడా సీఎంను కలిశారు. కొద్ది రోజుల కిందట బీఆర్ఎస్ నేత తీగల కృష్ణారెడ్డి సచివాలయంలో రేవంత్ తో భేటీ అయ్యారు. మూడు రోజుల కిందట మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు కూడా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన సన్నితుడు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు తదితరులు గతంలో టీడీపీలో పనిచేసిన వారే కావడంతో ఈ భేటీలకు ప్రాధాన్యం ఏర్పడింది. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసి ప్రస్తుతం బీఆర్ఎస్, ఇతర పార్టీల్లో ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలతో రేవంత్ రెడ్డి సన్నిహితులు మంతనాలు జరుపుతున్నట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ నేతలు వరుస పెట్టి సీఎంను కలుస్తున్న నేపథ్యంలో రానున్న లోక్ సభ ఎన్నికల నాటికి ఏం జరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే తాము కేవలం మర్యాదపూర్వకంగానే కలిశామని సీఎంతో భేటీ అయిన తర్వాత నేతలంతా చెబుతున్నా.. పార్టీ మారేందుకేనంటూ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

---

## ‘మరణ సందేశం’ పుస్తకావిష్కరణ

**ముఖ్యఅతిథిగా హాజరైన కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్టు, జన నిర్ణయం ఎడిటర్ దామెర రాజేందర్ రాసిన ‘మరణ సందేశం’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు ప్రముఖ జర్నలిస్టు గౌరీ లోకేష్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ ఆవిష్కరణ సభకు మిద్దెపాక రవీందర్ అధ్యక్షత వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశిష్ట అతిథులుగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య హాజరయ్యారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తితో పాటు, కవి రచయిత విముక్తి చిరుతల కక్షి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అంతడుపుల శ్రీనివాస్, అడ్వకేట్ అంబేద్కరిస్ట్ బండి మొగిళి, వరంగల్ రచయితల సంఘం అధ్యక్షులు నల్లెల్ల రాజయ్య, జన సాంస్కృతిక మండలి రాష్ట్ర కన్వీనర్ మామిండ్ల రమేష్ రాజా, తెలంగాణ సాహితీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కోగిల చంద్రమౌళి, కవి రచయిత డాక్టర్ కట్కూరి మహేందర్ తదితరులు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ ‘మరణ సందేశం’ చదవాల్సిన పుస్తకం అన్నారు. రాజేందర్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల నుంచి ఇలాంటి పుస్తకాలు అనేకం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెస్ క్లబ్ వేదికగా మరణ సందేశం పుస్తకం ఆవిష్కరణ జరుగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సభకు అతిథిగా హాజరైన వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ రాజేందర్ నుంచి మరిన్ని రచనలు రావాలని ఆకాంక్షించారు. పుస్తకం తీసుకురావడం అభినందనీయం అన్నారు. జర్నలిస్టుగా, యాక్టివిస్టుగా రాజేందర్ ప్రయాణం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ సాగుతుందన్నారు. మరణ సందేశం పుస్తకం భవిష్యత్తుకు సందేశమని వీసికే రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, కవులు, రచయితలు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

---

## కేటీఆర్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అహంకారంతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్విట్టర్ పిట్ట కేటీఆర్ అమర్యాదగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజలు ఛీత్కరించినా బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి రాలేదన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ మతిభ్రమించి అవాస్తవాలను మాట్లాడుతున్నాడన్నారు. ప్రజలచేత తిరస్కరించబడిన కేసీఆర్‌ను సీఎం చేస్తామంటూ హైదరాబాదులో ఆటోలో తిరుగుతూ చీప్ ట్రిక్స్ చేస్తున్నడని మండిపడ్డారు. ఎమ్మెల్యే కేటీఆర్ మానసిక స్థితి సరిగా లేదన్న అనుమానం ఉందన్నారు. అందుకే మానసిక ఆరోగ్యచట్టం సెక్షన్ 12 (2) కింద కేటీఆర్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్ఓసీ ఇచ్చి చికిత్స చేయించి, హెల్త్ బులెటిన్ విడుదల చేయాలని బండి కోరారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాల్సింది పోయి, చౌకబారు విమర్శలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బండి సుధాకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

## గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రం తాడిచెర్లలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, జడ్పీటీసీ అయిత కోమల ప్రారంభించారు. గ్రామ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభిస్తారని అన్ని ఏర్పాట్లు చేయగా చివరి క్షణంలో మంత్రి పర్యటన రద్దు కావడంతో మండల నాయకులు పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రామారావు, నాయకులు అయిత రాజీ రెడ్డి, బడితెల రాజయ్య, ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి, కేసరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8న మెట్టుగుట్టపై స్టాల్స్‌కు టెండర్ల వేలం



**వరంగల్ వాయిస్, మడికొండ :** దక్షిణ కాశీ, హరిహర క్షేత్రంగా విరాజుల్లుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి క్షేత్రం మెట్టుగుట్టపై ఈ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా మెట్టుగుట్టపై ఏర్పాటు చేసుకునే స్టాల్స్ కు టెండర్లను వచ్చే నెల 8న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె శేషు భారతి తెలిపారు. లడ్డు, పులిహోర అమ్ముకొనుటకు, కొబ్బరికాయలు అమ్ముకొనుటకు, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనుటకు, అభిషేక పంచామృతాలు అమ్ముకొనుటకు, వాహన పార్కింగ్ నడుపుకొనుటకు, చెరకు బండి నడుపుకొనుటకు వేలములు దేవస్థాన కార్యలయమునందు నిర్వహించబడునని అన్నారు. ఆసక్తి గల వారు దేవాలయ కార్యాలయంలో ధరావత్తు చెల్లించి, టెండర్ ఫారం పొంది వేలం పాటలో పాల్గొనాలని ఈఓ కే.శేషు భారతి తెలిపారు.

## మడికొండ పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట పట్టణం, మడికొండ పద్మశాలి సంఘ భవన్ ఆవరణలో సోమవారం పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పద్మశాలి పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా కామని మల్లేష్, కార్యదర్శిగా కోమాకుల సమ్మయ్య, కోశాధికారిగా పొట్ల బత్తిని లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా పోతరాజు ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా నామని సదానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నామని కుమారస్వామి, మెరుగు రామ్ శంకర్ మాట్లాడుతూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ ప్రతినిధులు నల్ల ప్రభాకర్, డాక్టర్ యాదగిరి, బిల్ల లింగయ్య, నామని రామ్మోహన్ రావు, కేటిక సదానందం, వంగ రమేష్, కన్నె మల్లేశం, చిదురాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నల్ల రాజేందర్, నామని శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కులగణన నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం

### బీసీ సంఘాల నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో కూడా కులగణన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంఘాల నాయకులు సోమిడి అంజన్ రావు, డాక్టర్ శేషు తెలియజేశారు. హరిత కాకతీయ హొటల్ లో డాక్టర్ తిరునహరి శేషు అధ్యక్షతన జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినా వివిధ కులాల లెక్కలను మాత్రం బయట పెట్టలేదన్నారు. కానీ, కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో కుల గణన చేయాలని నిర్ణయించటాన్ని బీసీ సంఘాలుగా ఆహ్వానిస్తున్నామని అభిప్రాయపడ్డారు. బీసీలు దశాబ్దాలుగా కులగణన చేయాలని డిమాండ్ చేసినప్పటికీ కూడా ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేయాలని నిర్ణయించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రిజర్వేషన్లను హేతుబద్ధంగా అమలు చేయడానికి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో వివక్షత లేకుండా అమలు చేయటానికి ప్రభుత్వ విధాన నిర్ణయాల రూపకల్పనకు కులగణన సహాయపడుతుందని తెలిపారు. డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ కులగణన విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కూడా కుల గణన పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు కులగణన చేస్తున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి కుల గణన చేయటంలో ఉన్న అభ్యంతరాలు ఏమిటో ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా కులగణన చేయడం ద్వారా వెనుకబడిన తరగతులకు న్యాయం చేయగలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిరాజు యాదవ్, జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ బరిలో రాయపురం సాంబయ్య



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో కైవసం చేసుకోవాలి మహబూబాబాద్ పార్లమెంటు పట్టణంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో రాయపురం సాంబయ్య అన్నారు. అదేవిధంగా దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న రాయపురం సాంబయ్యకు కేటాయించి ఎరుకల సామాజిక వర్గాన్ని చట్టసభల్లోకి పంపాలని అధిష్టానాన్ని కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ భద్రాచలం నుంచి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కర్రెద్దుల కమల కుమారి రెండుసార్లు ఎంపీగా చేసి కేంద్రమంత్రిగా కూడా పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎరుకల సామాజిక వర్గానికి రాజకీయంగా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మహబూబాద్ పార్లమెంటు స్థానాన్ని ఎరుకల సామాజిక వర్గానికి చెందిన తనకు ఇవ్వాలని కోరారు. తనకు టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిచి అధిష్ఠానానికి బహుమతిగా ఇస్తానని రాయపురం సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రాగం మల్లయ్య, కట్ల పాపయ్య, కేతిరి ఉపేందర్, రాయపురం సంపత్, కోట ఎల్లేష్, రాగం తిరుమలేష్ గుప్తా, భద్రయ్య, వెంకన్న, ఉపేందర్, రాయపురం ఎల్లయ్య, వీరేశం పాల్గొన్నారు.

## బీసీ కులగణన నిర్ణయం హర్షనీయం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించటం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం ప్రకటించారు. కుల గణన చేపట్టి కులాల వారీగా లెక్కలు తీసి వారి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వారి సంక్షేమానికి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గత అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు నడుస్తున్న గత ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వలన బీసీలు అట్టడుగు వర్గాల ప్రజలు అన్ని రంగాలలో అన్యాయానికి గురై తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రధానమంత్రి బీసీ అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడంలో పూర్తిగా విఫలమైనందున వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాలు కులగణన చేపట్టాయన్నారు. మన పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో కుల గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బీసీ కులగణనను చేపడతామని ఇచ్చిన హామీని అమలుపరిచేందుకు చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు. కుల గణన తర్వాతనే బీసీలకు 44శాతం రిజర్వేషన్లను పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్లో బీసీల, కులవృత్తుల అభివృద్ధికి సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలను కేటాయించాలన్నారు. చేనేత, గీత వృత్తి వారలకు ఇస్తున్న విధంగా మిగతా చేతివృత్తుల వారందరికి కూడా 50సంవత్సరాల వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని వెంటనే అమలు పరచాలని వెంకట్రాములు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# బీసీ దళపతి పరికిపండ్ల అశోక్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మేమెంతో మాకంతా.. మీరెంతో మీకంతా..అనే సామాజిక న్యాయాన్ని పాటిస్తూ సగానికి పైగా ఉన్న బీసీలకు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంటు స్థాయి వరకు సముచిత స్థానం కల్పించాలని, జనాభా గణనలో బీసీ కాలం తప్పనిసరిగా చేర్చాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ గత రెండు సంవత్సరాలుగా ఏకధాటిగా ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాలు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర ఎనిమిది రాష్ట్రాలలో నిరంతరం తిరుగుతూ బీసీ సమాజాన్ని జాగృతం చేస్తున్న బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ను ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జన గణనలో కుల గణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోటలో సోమవారం సీనియర్ వైద్యులు డాక్టర్ ఆడేపు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ప్రధానమంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ రూపకర్త డాక్టర్ అశోక్ పరికిపండ్ల మాట్లాడుతూ బీసీలు శాంతియుతంగా రాజ్యాధికారం దిశగా పయనించాలని, భారత దేశ స్వాతంత్రం వచ్చిన దగ్గర నుంచి జనాభా గణనలో కుల గణన చేపట్టకపోవడం వల్ల బీసీల లెక్క తేలలేదని, దాంతో రాజ్యాంగబద్ధంగా మనమెంతో మనకంత అనే సామాజిక న్యాయం జరగక తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలతో సహా, జాతీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఈసారి జన గణనలో కుల గణన చేపట్టాలని తీవ్రఒత్తిడి తీసుకురావాలని, మన హక్కులను సాధించుకునేంత వరకు విశ్రమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేణు, పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం నాయకులు సుధాకర్, అఖిలభారత పద్మశాలి ఇంజినీర్ల సంఘం నాయకులు యాదగిరి, ఎంపీడీవో విద్యాసాగర్, పద్మ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణశాస్త్రిలతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు సారంగపాణి, దామోదర్, సత్యరాజు, సుదర్శన్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాము, కిరణ్, విజయ్ చంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోండి

## అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఐడీఓసీలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సవ్ టోప్పో దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజల దరఖాస్తులలోని సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నెల్లికుదురు మండలం నైనాల రెవెన్యూ విలేజ్ హనుమాన్ తండాకు చెందిన భూక్య భిక్షం ఎస్.ఆర్.ఎస్.పీ కాలువ క్రింద సాగు చేసుకుంటున్న తను ఇంకా కొందరు రైతుల భూములు మొత్తం కలిపి 52ఎకరాల భూమి ఉంది. ఆ ఆయకట్టు క్రింద పంటలు పండించుకున్న తమ భూమిలోనికి నీరు రాకుండా కొందరు వ్యక్తులు నీటిని దారి మళ్లిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దయతో ఆ ఆయకట్టు క్రింద సాగు చేస్తున్న తమ భూములకు నీటి లభ్యతను చేకూర్చి తగు న్యాయం చేయాలని ఆయన కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గొర్రెకుంట గ్రామానికి చెందిన బి.కిరణ్ కుమార్ జులై లో జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో ఎర్లీ ఇంటర్ వెన్షనిస్ట్ కం స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్ట్ ఎంపిక కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నానని, ఆ పోస్టుకు కావలసిన అర్హతలు అన్ని ఉన్నా తనను కాదని తన కంటే తక్కువ మార్కులు వచ్చిన వారిని ఆ ఉద్యోగానికి ఎంపిక చేశారని, మెరిట్ ప్రకారం తనకు ఉద్యోగం కల్పించి తగు న్యాయం చేయాలని కోరారు. చిన్న గూడూరు మండలానికి చెందిన కె.సంధ్య మహబూబాబాద్ లోని మెడికల్ కాలేజీ లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వార్డ్ ఉమెన్ పోస్టుకు అన్ని అర్హతలు ఉన్నాయని, ఆ ఉద్యోగానికి ఎంపిక చేసి తగు న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ మండలానికి చెందిన కొంత మంది రైతులు బ్యాంకుల ద్వారా తమ పోడు పట్టాలకు క్రాప్ లోన్ ఇప్పించగలరని కోరారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణీలో (73)దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈఓ రమాదేవీ, డీఆర్ డీఏ పీడీ సన్యాసయ్య, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మేడారం జాతరను విజయవంతం చేద్దాం

### ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే మేడారం జాతరను విజయవంతం చేద్దామని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం జాతరకు భక్తులు కోటికి పైగా వస్తుంటారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే వాహనాలు ఎక్కువ రద్దీ ఉన్న చోట పోలీస్ అధికారులను ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపై యూటర్న్ లు ఉన్న చోట వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, వాహనాలను అతివేగంగా నడపరాదని కోరారు. ఫిబ్రవరి 21 నుంచి జరిగే మేడారం జాతరను జయప్రదం చేయడానికి పోలీసులు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## మణెమ్మ భౌతికకాయానికి జడ్పీ చైర్మన్ నివాళి




**వరంగల్ వాయిస్, ములుగు :** తాడ్వాయి మండలంలోని ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి తల్లి ఆలేటి మణెమ్మ సోమవారం పరమపదించారు. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి వచ్చి ఆమె భౌతిక కాయాన్నికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. భౌతిక కాయాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, తాడ్వాయి పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఇందిరారపు లాలయ్య, పత్తి గోపాల్ రెడ్డి, బండారి చంద్రయ్య, రజనీకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బంగారు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి స్వర్గం ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రానికి చెందిన గాజుల రాజేందర్ టీ స్టాల్ నడుపుకుంటూ కుటుంబ జీవన సాగించేవారు. అనారోగ్యంతో అకాల మరణం పొందగా నిరుపేద కుటుంబానికి చెందిన ఆ కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గ నాయకుడు సర్గం రవి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెండు రాధిక రమేష్, పద్మశాలి కుల సంఘం ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, కోశాధికారి పత్తిపాక మురళి, మెరుగు శివానందం, అశోక్, మణికంఠ, కులస్తులు పాల్గొన్నారు.

## కోదండరామ్‌ను కలిసిన కేశపాక తరుణ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నూతనంగా గవర్నర్ కోటలో ఎన్నికైన తెలంగాణ ఉద్యమ రథసారథి జనసమితి పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను విద్యార్థి జన సమితి స్టేట్ సెక్రెటరీ కేశపాక తరుణ్ ఆయన నివాసం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, బొకే అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డివిజన్‌లో స్మార్ట్ సిటీ ఫండ్ కింద అండర్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉండటం వలన ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు తగు చొరవ చూపాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి గ్రీవెన్స్ సెల్ లో మహానగరపాలక సంస్థ కమిషనర్ రిజ్వానా బాషాకు వినతి పత్రం అందజేశారు. డివిజన్ లో పలు అభివృద్ధి పనుల కింద మంజూరైన అభివృద్ధి పనులకు టెండర్ పిలిచిన తర్వాత కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకుని ఇంకా పనులు మొదలు పెట్టని వాటిని వెంటనే పనులు ప్రారంభించేందుకు, అర్థాంతరంగా ప్యాకేజీ వర్క్ లలో నిలిచిపోయిన శ్మశాన వాటిక పనులు కమ్యూనిటీ హాల్ నిర్మాణ చేపట్టాలని కోరారు. కొందరు కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో పనిచేయక వదిలివేసిన పనులను వెంటనే పూర్తిస్థాయిలో చేయించాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్లో కొత్తగా వెలిసిన కాలనీలలో కరెంటు స్తంభాలతో పాటు మూడు వైర్లు అమర్చుటకు చొరవ చూపాలని వినతి పత్రంలో కోరారు. కమిషనర్ రిజ్వానా భాష స్పందిస్తూ పూర్తిస్థాయిలో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ కు నోటీసు పంపుతామని, అలాగే నిలిచిపోయిన పనులు పూర్తిస్థాయిలో కావడానికి అధికారులకు ఆదేశిస్తామన్నారు.

## వెండి శుభలేఖతో పెండ్లి పిలుపు




**వరంగల్ వాయిస్, నయీంనగర్ :** హనుమకొండలోని ఆదర్శ కాలని నివాసి రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు –సుమలతల కుమార్తె అభిజ్ఞ ఐఐటీ, ఐఐఎంతో ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన చప్పిడి వరప్రసాదరావు –సత్యవేణిల కుమారుడు లక్ష్మీ గణపతి ఐఐటీ, ఐఐఎంతో వివాహం నిశ్చయమైంది. ఫిబ్రవరి 24న జరిగే వివాహానికి సంబంధించిన చప్పిడి వారి పెళ్లి పిలుపు శుభపత్రికను వియ్యాలవారు వెండి శుభలేఖతో సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతు వియ్యాల వారు వరకట్నం ఆశించకపోవడమే కాకుండా వెండి కళ్యాణ శుభపత్రికతో ఆహ్వానించడం, పెండ్లి విందు కూడా వెండి ప్లేట్లలో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలపడం ఎంతో ఆనందంగా, గర్వకారణంగా ఉందన్నారు.

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ



**వరంగల్ వాయిస్, ములుగు :** కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.వేణుగోపాల్ తో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.శ్రీజ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం (16) దరఖాస్తులు రాగా, అందులో (06) రెవెన్యూ, (10) ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ అప్పలనాయుడు, డీఈ ఎలక్ట్రిసిటీ నాగేశ్వరరావు, చీఫ్ ప్లానింగ్ అధికారి ప్రకాష్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎస్ఓ అధికారి సర్దార్ సింగ్, సివిల్ సప్లై అధికారి అరవింద్ రెడ్డి, డీఎం రాములు, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీలారపు ధీరజకు ప్రతిభా పురస్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాచిగూడ హైదరాబాద్ లో సోమవారం జరిగిన మున్నూరు కాపు విద్యార్థి ప్రతిభ పురస్కారం కార్యక్రమంలో హనుమకొండ బస్టాండ్ ప్రాంతానికి చెందిన నీలారపు ధీరజ సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి శాలిని శాకెల్లి చేతుల మీదుగా మున్నూరు కాపు విద్యార్థి ప్రతిభా పురస్కారం, ప్రశంసా పత్రం, మెడల్ అందుకున్నారు. 2023 సంవత్సరంలో పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా హనుమకొండ జిల్లా నుంచి నీలారపు ధీరజను ఈ పురస్కారానికి ఎంపిక చేసి నేడు మున్నూరు కాపు ట్రస్ట్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఈ మున్నూరు కాపు విద్యార్థి ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ వెంకట రావు, తల్లి తండ్రులు నీలారపు అశోక్ కుమార్, శ్రీదేవి, రుత్విక్ తదితరులు ధీరజను అభినందించారు.

## ఉపాధ్యాయుల విహార యాత్ర



**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** తిమ్మాపూర్ మండలం ఎస్ జీటీ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సోమవారం విహార యాత్రకు వెళ్లారు. ఈ విహార యాత్రలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప, లక్నవరం, భద్రకాళి గుడి, ఖిలా వరంగల్ కోటను సందర్శించారు. ఈ విహారయాత్రలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. దేవ శంకర్, ఎస్జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కె.మహిపాల్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్, సమన్వయకర్తలు జి.శేఖర్, బి.కర్ణాకర్, వింజమూరి విజయ్ గోపాల్, సుద్దాల శ్రీనివాస్, మారాజు శ్రీనివాస్, సునీత, మంజుల రెడ్డి, 50మంది ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కందుల రేఖ గట్టయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. విధి నిర్వహణలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఇక ముందు జరగబోయే సర్వసభ్య సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు మెరుగైన వైద్యం అందించి ప్రసూతి సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం పదవి ముగియనున్న సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులు, ఎంపీడీఓ, స్థానిక తహసీల్దార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## హెల్త్ సబ్ సెంటర్ తనఖీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ ఆవరణలోని హెల్త్ సబ్ సెంటర్ ను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహ మూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనఖీలో భాగంగా సిబ్బంది అటెండెన్స్, సబ్ సెంటర్ హెల్త్ రికార్డులు, మెడిసిన్ ఎక్స్పైరీ డేట్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధిక మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టాలని స్టూడెంట్ మేనేజ్ మెంట్ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ని విడుదల చేయాలనీ సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేకపోతే జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు రమేష్, ఉదయ్, సాయి, శ్రీనాథ్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ట్రస్మా జిల్లా సర్వసభ్య సమావేశం

### పూర్తి స్థాయి జిల్లా కమిటీ ఎన్నిక

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పద్మావతి డిగ్రీ కాలేజ్, పోచమ్మ మైదాన్ లో ట్రస్మా (వడుప్స) వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంకటి.వీరస్వామి అధ్యక్షతన మొదటి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వడుప్స జిల్లా ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా నిస్స జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జేఎస్ పరంజ్యోతి, జిల్లా ముఖ్య సలహాదారులు యన్.వెంకటేశ్వర రావు హాజరై ప్రస్తుత పాఠశాలల సమస్యలపై చర్చించి, సంఘ సభ్యుల శ్రేయస్సు కోసం, మెజార్టీ సంఘ సభ్యుల ఆమోదంతో వడుప్స వరంగల్ జిల్లా పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మెజారిటీ సంఘ సభ్యుల ఆమోదంతో గత కొన్ని సంవత్సరాలుగా వడుప్సకి విశిష్టమైన సేవలు అందించినటువంటి సీనియర్ నాయకులు ఆడేపు వెంకటేశ్వర్లు, సమియుల్లా బేగ్, ఎన్.కిరణ్ కుమార్, గోవిందరాజులు, ఆకుల శ్రీనివాస్, కూచన కవిత, ఎం.రాజు, వి శ్రీనివాస్ ఎస్ వెంకట్రాజాం,





ఆర్.మాధవి, గౌరీ శంకర్, ఏ.వినోద్ కుమార్, నరసింహమూర్తి తదితరులను జిల్లా కమిటీలో ఎన్నుకోవడం జరిగింది. ఈ పూర్తి స్థాయి జిల్లా కమిటీకి డాక్టర్ జె.యస్.పరంజ్యోతి ప్రమాణస్వీకారం చేయించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సంఘ నియమావళికి లోబడి, ట్రస్మా జిల్లా సంఘ సభ్యుల పూర్తి సహకారంతో సలహాలు, సూచనలతో సంఘ ఐకమత్యానికి, పాఠశాలల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతామని తెలిపారు. అనంతరం ప్రఖ్యాత నేషనల్ మోటివేటర్ శ్రీ దర్పన్ వాసుదేవ్ చే పాఠశాలల –అభివృద్ధి, యాజమాన్యం ఆర్థిక– మనోవికాసంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ తరగతులు కరస్పాండెంట్స్ కు ఎంతో స్ఫూర్తిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా (వడుప్సా) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, జిల్లా కోశాధికారి ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అకినేపల్లి సతీష్ కుమార్, జిల్లా సలహాదారులు కోడం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, ప్రధాన కార్యదర్శి దాసి సతీష్ మూర్తి, వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్, వరంగల్ జోన్ ఉపాధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్, వరంగల్ జోన్ సలహాదారులు కొడిమెల రవి, మహమ్మద్ నజీర్, మహమ్మద్ ఉస్మాన్, నందాల చందర్ బాబు, బత్తుల సురేందర్ ఖలీల్, సునీత, పిట్టల సురేష్, ఇనాయత్, జిల్లాకు చెందిన వివిధపాఠశాలల కరస్పాండెంట్స్ అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులకు భారంగా ఉండొద్దనే ఉద్దేశంతో, కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ తో పాటు, తులం బంగారాన్ని కూడా త్వరలో అమలు చేయనున్నామని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉంటానని, వారు ఏ సమస్య ఉన్న తనను నేరుగా కలవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి ఝాన్సీ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ గాయనికి ప్రశంసాపత్రం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భద్రాద్రి రామయ్య–భద్రాద్రి (గోవిందా నారసింహ ఆశ్రమం–గోశాల)లో జరిగిన ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో టీవీ అశోక్ కుమార్ సీఓ అధ్వర్యంలో ఏఎన్ఎస్ 24టీవీ న్యూస్, మేనేజింగ్ డైరెక్టర్ అనుమాండ్ల నాగరాజు, వనపర్తి పద్మావతి, పోకల శ్రీనివాస్ నిర్వాహణలో 108ఆధ్యాత్మిక గాయకులు– భక్తి గీతాల, కీర్తనలు పాటలతో 12గంటలు నిర్విరామంగా కార్యక్రమంనిర్వహించారు. వరంగల్ నుంచి గాయని సన్నారి ఎంపికై పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ఆమె షీల్డ్, మెమో ప్రశంసా పత్రం అందుకోవటం జరిగింది.

# పటిష్టమైన ఓటరు జాబితాకు ఇంటింటి సర్వే

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పటిష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని ఓటర్ల జాబితా పరిశీలకులు బాల మాయాదేవి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా అధికారుల సముదాయం కలెక్టర్ సమావేశం మందిరంలో ఓటర్ల జాబితా పరిశీలకులు బాల మాయాదేవి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ తో కలిసి మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై అదనపు కలెక్టర్లు ఆర్డీవోలు, తహసీల్దార్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరిశీలకులు బాల మాయాదేవికి వివరిస్తూ జిల్లాలో రెండు నియోజకవర్గాలలో 539 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు చెప్పారు. ఆయా కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితా రూపకల్పనకు ఈ నెల 21, 22తేదీలలో బీఎల్ఓలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఆన్ లైన్ ద్వారా బీఎల్ఓలు ఓటర్లకు అవగాహన పరిచి దరఖాస్తులను యాప్ ద్వారా స్వీకరించడం జరుగుతున్నదని



వివరించారు. కళాశాలల విద్యార్థులతో గుర్తించిన అంబాసిడర్స్ తో ఓటు హక్కు విశిష్టతను తెలియజేయాలన్నారు. సాధ్యమైనంత వేగవంతంగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టాలని సూచించారు. మృతుల ఓటర్లు తొలగింపులో డెత్ సర్టిఫికెట్లు పరిశీలన చేస్తూ కుటుంబ సభ్యులతో వాంగ్మూలం తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సవ్, డేవిడ్, స్వీప్ నోడల్ అధికారి డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, మహబూబాబాద్, డోర్నకల్ ఆర్డీఓలు అలివేలు, నరసింహారావు, మహబూబాబాద్, కురవి తహసీల్దార్లు భగవాన్ రెడ్డి, సునీల్ రెడ్డి, సీరోల్ తాసిల్దార్ నరేష్, ఎన్నికల విభాగం అధికారులు పవన్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# డీపీఆర్ఓను సస్పెండ్ చేయాలి

## కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జర్నలిస్టులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** డీపీఆర్వోను సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను పలువురు విలేకరులు కోరారు. మహబూబాబాద్ జిల్లాలో వివిధ మీడియా సంస్థలలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డు 2022-2024 కాలానికి మంజూరు విషయంలో అవకతవకలు జరిగాయని పలుమార్లు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారికి, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులు ఇచ్చినా డీపీఆర్ వో కనీసం కమిటీ, విచారణ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కాబట్టి డీపీఆర్ఓను వెంటనే సస్పెండ్ చేసి, నూతన డీపీఆర్ఓను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక మీడియా సంస్థలో పనిచేసి మరో మీడియా సంస్థలో అక్రిడేషన్ కార్డులు పొందిన కార్డులపై, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, పోక్సో, మర్డర్ కోర్టు కేసులు ఉన్నవారికి, ప్రైవేట్ ఉద్యోగులు, మీడియా సంస్థలలో పని చేయని అనర్హులకు, కిరాణా షాప్ మర్చంట్ వారు పొందిన అక్రిడేషన్ కార్డులపై విచారణ చేసి, కార్డుల మంజూరుకు గల కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, పూర్తిస్థాయి విచారనంతరం రద్దు చేసి, వెంటనే నూతన కార్డ్ లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు. డీపీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న అధికారి ఓ వర్గానికి కొమ్ముకాస్తూ అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాలు దూరం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అవకతవకలకు పాల్పడిన సదరు అధికారిపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాల్నే సుమన్, జంగిలి మధు, సహదేవ్, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ కాలనీ బోర్డు ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లో నూతనంగా వెలుస్తున్న కాలనీలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం కరీమాబాద్ వాటర్ ట్యాంక్ నుంచి ఉర్సు చెరువుకు వెళ్లు దారిలో నల్లరాళ్ల వద్ద ఏర్పడిన కాలనీకి ఆ ప్రాంతంలోని ఇంటి యజమానులు అందరూ కలిసి సమిష్టిగా ఉర్సు ప్రగతి నగర్ గా నామకరణ చేసిన బోర్డును కార్పొరేటర్ మరుపల్ల రవి ఆవిష్కరించారు. నూతనంగా వెలిసిన ప్రగతి నగర్ లో పైపులైను విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు అధికార దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రగతి నగర్ పేరును అధికారికంగా మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రకటించుటకు మేయర్ గుండు సుధారాణి, కమిషన్ రిజ్వానా బాషా దృష్టికి తీసుకు వెళతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్ మరుపల్లి రవిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలిల్ గౌడ రాము, బానోత్ బద్రు నాయక్, శ్రీనివాస్, దాసి రవి చందర్, మరుపల్ల గౌతమ్, బసిత్ కర్, సాయి కృష్ణ, కుందే కుమార్, విజయ్, పత్తిపాక శ్రీను, పెంచాల రమేష్, దాసి నాగరాజు, సురేష్ కలారంలు ఉన్నారు.ట

## సీఈఐఆర్‌తో మొబైల్ అప్పగింత

### ఆనందం వ్యక్తం చేసిన బాధితుడు



**వరంగల్ వాయిస్, రేగొండ :** సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ పట్టుకొని బాధితుడికి అప్పగించడం జరిగిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల ఎస్ఐ ఎన్ రవి కుమార్ తెలిపారు. గత కొద్ది రోజుల క్రితం నారాయణపూర్ గ్రామానికి చెందిన కన్నెబోయిన భాస్కర్ తన టు వీలర్ బైక్ మీద మందుల కోసం వచ్చి రేగొండ నుంచి నారాయణపూర్ వెళుతుండగా తన 20,000 విలువ గల వివో మొబైల్ ఫోన్ పోయిందని రేగొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అతని మొబైల్ ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్ లో నమోదు చేయగా ఆ ఫోన్ లో వేరే వ్యక్తి సిమ్ కార్డు వేయడంతో పోలీస్ స్టేషన్ కు అలెర్ట్ మెసేజ్ వచ్చింది. దీంతో మొబైల్ ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగిస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్ పోయిన బాధితుడు భాస్కర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ మొబైల్ ఫోన్‌ను గుర్తించడంలో కృషి చేసిన రేగొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది సట్ల ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రవికుమార్‌ను స్థానికులు అభినందించారు. మండలంలో ఎవరివైనా మొబైల్ ఫోన్లు పోయినట్లయితే వెంటనే రేగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

# పైళ్ల మల్లయ్య సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, రేగొండ :** సీపీఐ పార్టీకి తమ జీవితకాలం సేవలు అందించి భూములను పంచిన కామ్రేడ్ పైళ్ల మల్లయ్యను సీపీఐ ఎప్పుడు మర్చిపోదని సీపీఐ సీనియర్ జిల్లా నాయకుడు మామిడాల సమ్మిరెడ్డి అన్నారు. రేగొండ ఉమ్మడి మండలం చిన్నకోడపాక గ్రామంలో కామ్రేడ్ పైళ్ల మల్లయ్య రెండవ వర్ధంతి సోమవారం వారి కుమారులు నిర్వహించారు. చిన్నకోడెపాక గ్రామంలో కామ్రేడ్ పైళ్ల మల్లయ్య రెండో వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ గ్రామ కార్యదర్శి పప్పుల సారయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ సీనియర్ నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, గుంటి చంద్రమౌళి పాల్గొని మల్లయ్య స్తూపానికి పూలమాలతో సత్కరించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ మల్లయ్య ఒక నిబద్ధతగల కమ్యూనిస్టు అని, భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎర్రజెండా చేతబట్టి అనేక ఉద్యమాలు చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వ్యాప్తి కోసం అహర్నిశలు కృషి చేసి పార్టీని విస్తరింపజేసిన నాయకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి పైళ్ల శాంతి కుమార్, రేగొండ మండల సీపీఐ కార్యదర్శి పెంట రవి, మార్క రామయ్య, గుర్రాల రవీందర్, చక్రపు ఆగయ్య, గుండు సమ్మయ్య, మాడ సాంబయ్య, నగిరి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## పంట చేలకు కోతుల బెడద



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని మానేరు తీర ప్రాంతంలో వల్లెంకుంట, కుంభం పల్లి గ్రామాల రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటకు కోతుల బెడద ఎక్కువైంది. రోజు సమీప అటవీ ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో వస్తున్న కోతులు పంట చేలల్లో పడి మొక్క జొన్న పంటకు తీవ్ర నష్టం చేస్తున్నాయి. పంట చేతికందే సమయంలో కోతులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, చేల వైపు వెళ్లిన రైతులపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సీపీఐలో సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని హనుమకొండ జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి చేతుల మీదుగా ఇల్లందుల సాంబయ్య-ఇల్లందుల లక్ష్మి స్వీకరించారు. 1985నుంచి సీపీఐ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నామని, పార్టీ నిర్వహించే ప్రజా పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొంటూ రాష్ట్ర రజక సంఘంలో కార్యవర్గ సభ్యులుగా పనిచేయడాన్ని నేదునూరి జ్యోతి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా సమితి సభ్యులు నేదునూరి రాజమౌళి పాల్గొన్నారు

## పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి

### ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టభద్రులందరూ తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ అన్నారు. వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తున్నాయి. కాబట్టి, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చంటి ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయని సెప్టెంబర్ 1, 2020వరకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతైన వారు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. గతంలో పట్టభద్రుల ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకున్నప్పటికీ ఇప్పుడు ఆ ఓటరు జాబితా చెల్లదని కాబట్టి, అర్హత కలిగిన వారందరూ ఫిబ్రవరి 6లోగా ఆన్ లైన్ లో గాని, ఆఫ్ లైన్ లో గాని ఫారం 18ద్వారా కానీ సంబంధిత డిప్యూటీ తహసీల్దార్ ఆఫీస్ లో గాని నమోదు చేసుకోవాలన్నారు.

## జర్నలిస్టు రమేష్‌కు పరామర్శ



**వరంగల్ వాయిస్, ములుగు :** ఇంచర్ల గ్రామానికి చెందిన వి6 న్యూస్ జర్నలిస్ట్ కుంచం రమేష్ అనారోగ్యంతో కొద్ది రోజుల నుంచి బాధపడుతుండగా, అతడిని టీవీ5 సీనియర్ కరస్పాండెంట్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, వి6ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ జర్నలిస్ట్ కృష్ణమోహన్, టీవీ9 సీనియర్ జర్నలిస్ట్ పెద్దిష్, ప్రైమ్9 న్యూస్ సీనియర్ జర్నలిస్ట్ తిరుపతి, ములుగు జిల్లా సీవీఆర్ న్యూస్ జర్నలిస్టు గాదం దేవేందర్, రాజ్ న్యూస్ జర్నలిస్టు గుగ్గిళ్ల సుజన్ లు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఇటీవలీ కాలంలో ఆనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పోంది ఇంటికి వచ్చిన రమేష్ ను కలసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# విడుదల తేదీల్లో మార్పు

సంక్రాంతి పండగ నాడు నాలుగు సినిమాలు విడుదలయ్యాయి. అయితే అప్పుడు ఐదో సినిమా రవితేజ నటించిన 'ఈగల్' కూడా విడుదలవ్వాల్సి వుంది కానీ, నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ ఆ సినిమా నిర్మాతల మధ్య సయోధ్య కుదిర్చి 'ఈగల్' సినిమాని వాయిదా వేసుకోమని చెప్పారు. అప్పుడు పోటీ లేకుండా చేస్తామని కూడా ఆ సినిమా నిర్మాతకి హామీ ఇచ్చారు. తరువాత 'ఈగల్' ఫిబ్రవరి 9న విడుదల చెయ్యాలని నిర్ణయించుకొని ఆ తేదీని ప్రకటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణ సంస్థ. తరువాత సందీప్ కిషన్ తన సినిమా 'ఊరి పేరు భైరవకోన' అనే సినిమాని ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ సినిమాకి నిర్మాత రాజేష్ దండా, దర్శకుడు విఐ ఆనంద్. ఇది ఒక ఫాంటసీ నేపథ్యంలో తీసిన సినిమా. ఈ సినిమా ప్రచారాలు కూడా మొదలెట్టేసారు, ఫిబ్రవరి 9 తప్పితే మాకు ఇంకా వేరే తేదీ లేదు విడుదల చెయ్యడానికి అని కూడా ఒక ప్రచార ఈవెంట్ లో చెప్పేసాడు సందీప్ కిషన్. ఇది తెలిసి పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ కొన్ని రోజుల క్రితం, నిర్మాతల మండలికి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ కి ఒక లేక రాశారు. అందులో తన సినిమా 'ఈగల్' విడుదలప్పుడు పోటీ లేకుండా చేస్తామని మాటిచ్చారు, ఆ మాట నిలబెట్టుకోండి అని చెప్పారు. అందుకోసమని ఈరోజు నిర్మాతల మండలి, తెలుగు ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ సమావేశం నిర్వహిస్తున్నారు. అందులో 'ఊరు పేరు భైరవకోన' సినిమా విడుదల వాయిదా వేసుకోమని ఆ సినిమా నిర్మాతకి చెపుతారని తెలిసింది. అతను కూడా ఇంకో కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారని కూడా తెలిసింది.






# అవార్డుల పంట

ఆర్ఎక్స్ 100', 'మహాసముద్రం' చిత్రాల తర్వాత అజయ్ భూపతి దర్శకత్వం వహించిన సినిమా 'మంగళవారం'. ఈ సినిమా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ తో కూడి వున్న నేపథ్యంలో వచ్చింది. థియేటర్స్ లో విడుదలై అక్కడ మంచి విజయం సాధించిన ఈ చిత్రం ఇటీవల పాపులర్ ఓటిటి డిస్నీ హాట్ స్టార్ లో కూడా విడుదలై ప్రపంచవ్యాప్త ప్రేక్షకులని కూడా అలరిస్తోంది. మా 'మంగళవారం', టెక్నీషియన్స్ సినిమా అని గర్వంగా చెబుతున్నాను!' అని దర్శకుడు అజయ్ భూపతి సక్సెస్ మీట్ లో చెప్పింది నిజం చేస్తూ ప్రతిష్మాత్మకంగా జరిగే జైపూర్ ఫిలిం ఫెస్టివల్ లో ఈ సినిమా నాలుగు అవార్డులని గెలుచుకుంది. అందులో ఈ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించిన పాయల్ రాజపుత్ కి వుత్తమ నటి అవార్డు దక్కింది. అలాగే ఈ సినిమా సాంకేతికపరంగా కూడా ఎంతో బాగుంది అని ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. అందులో కూడా మూడు అవార్డులు ఈ సినిమా గెలుచుకుంది. చిత్ర నిర్మాతలు ముద్ర మీడియా వర్క్స్ స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ ఈ విషయాన్ని సంతోషంగా చెబుతూ అవార్డులు గెలిచిన వారి పేర్లు వెల్లడించారు... ఉత్తమ సౌండ్ డిజైన్ - రాజా కృష్ణన్, ఉత్తమ ఎడిటింగ్ - గుళ్ళపల్లి మాధవ్ కుమార్ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ - ముదసర్ మొహమ్మద్, సాంకేతిక పరంగా, నిర్మాణ పరంగా మంచి విలువలున్న చిత్రంగా 'మంగళవారం' ఇప్పటికే ప్రశంసలు అందుకోగా ఈ అవార్డులు కేవలం ఆరంభం మాత్రమే ఇంకా ముందు ముందు మరిన్ని అవార్డులు గెలుచుకుంటుందని తమ ఆనందం వ్యక్తం చేసారు చిత్ర దర్శకుడు, నిర్మాతలు.




# మునుపుకంటే మరింత చురకుగా.. సమంత

అగ్ర నటీమణుల్లో ఒకరైన సమంత ఎయిర్ పోర్టు నుండి వస్తున్నప్పుడో, వెళుతున్నప్పుడో ఫోటోలు సామజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. సమంత మయోసిటిస్ అనే వ్యాధితో బాధపడుతూ అందుకోసమని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్న సంగతి కూడా తెలిసిందే. ఆమె చివరి సినిమా 'ఖుషి' విడుదలైంది, ఆ తరువాత ఆమె సినిమాలు ఏమీ కొత్తవి ఒప్పుకోలేదు, కానీ నిర్మాతగా కొన్ని సినిమాలు చేస్తాను అని చెప్పారు. ఈమె చెయ్యాల్సిన సినిమా ఒకటి ఇప్పుడు శృతి హాసన్ చేస్తున్నారు. అంటే సమంత ఇప్పట్లో సినిమాలు చేసే పరిస్థితి కనిపించడం లేదు అని తెలుస్తోంది. అయితే ఇంతకీ సమంత మళ్ళీ వెండితెర మీద కనిపించదా, అనే సందేహం కూడా ఆమె అభిమానుల్లో చోటుచేసుకుంటోంది. ఎందుకంటే ఆమె చివరి సినిమా 'ఖుషి' గత సంవత్సరం సెప్టెంబర్ 1న విడుదలైంది. ఆ సినిమా విడుదలవ్వకముందే సమంత అమెరికా వెళ్లి అక్కడ విశ్రాంతి తీసుకుంది. మళ్ళీ ఇండియా వచ్చింది, ఇక్కడ సినిమాలు చెయ్యడం లేదు కానీ, చాల చురుకుగా సామజిక మాధ్యమాల్లోనూ, అలాగే కొన్ని షోస్ లో కనపడుతూ అభిమానులను అలరిస్తున్నారు.



# ఆగస్టులో విడుదలకు సిద్ధంగా పుష్ప-2

టాలీవుడ్‌లో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'పుష్ప.. ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన పుష్ప.. ది రైజ్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్‌గా మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించేశారు మేకర్స్. ఈ సందర్భంగా పుష్ప రాజ్ తన రూల్‌ను ప్రారంభించడానికి ఇంకా 200 రోజులు మిగిలి ఉందంటూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో ఒక కొండపై పులి కనిపిస్తున్నట్లు ఉంది. కాగా ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. పుష్ప ది రూల్ కోసం రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ నుంచి ఫస్ట్ పార్టును మించిపోయే మరో చార్ట్ బస్టర్ ఆల్బమ్ రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఫస్ట్ పార్టులో శ్రీవల్లిగా నటించిన కన్నడ సోయగం రష్మిక మందన్నా సీక్వెల్‌లో మరోసారి ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించనుంది.



# పార్టీని కాపాడుకుంటాం..

**కేసీఆర్ వచ్చాకే తెలంగాణలో అభివృద్ధి**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మరో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం. గెలిచినా, ఒడినా పార్టీని కాపాడుకోవడం ముఖ్యమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ ఆర్ గార్డెన్ లో బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమాశానికి మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి, ఎంపి పసునూరి దయాకర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ..కేసీఆర్ ప్రవేశ పెట్టినన్ని సంక్షేమ పథకాలు దేశంలోనే మరెవరూ ప్రవేశపెట్టలేదన్నారు. గతంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గంలోని సాగు భూములకు చుక్కా నీరు అందలేదని గుర్తు చేశారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన తర్వాతే ఇక్కడి నేలలు పచ్చని పంట పొలాలుగా మారాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు, రైతు భీమా, 24 గంటలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కేసీఆర్ వచ్చాకే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు ఓటు వేశామని బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఆ పార్టీలో ఇప్పటికే అంతర్గత పోరు మొదలైందని జోస్యం చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ సీటు బీఆర్ఎస్ దే నన్నారు. బీఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. ఉద్యమకారులైన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా కమిటీలను పటిష్టం చేసి, పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ..ఓటమిపై సమీక్షించుకుని రాబోయే రోజుల్లో పార్టీ



బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించుకుంటున్నామన్నారు. మూడోసారి మోడీకి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ రైతుబంధు ఇవ్వకుండా నోట్లో అరటిపండు పెట్టిందన్నారు. కేసీఆర్ కంటే గొప్పగా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఏమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయారన్నారు. వంద రోజుల్లో కాకపోతే ఐదు సంవత్సరాలలోపు మీ హామీలు నెరవేర్చండి లేకుంటే ప్రజలు మీ హామీలపై నిలదీస్తారంటూ హెచ్చరించారు.

ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ...గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం పోటీపడిన విధంగానే వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడాలన్నారు. రైతుబంధు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి కోసం ఆయా వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్ రావు, జిల్లా రైతు బందు కో ఆర్డినేటర్ లలితా యాదవ్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ, సర్వర్, కార్పొరేటర్లు, పాక్స్ చైర్మన్లు, మండల, డివిజన్ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**కార్పొరేటర్ పల్లం పద్మ-రవి**

**మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఫ్యాషన్ ట్రెండ్ తో టైలరింగ్ కొనసాగిస్తూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ-రవి కోరారు. నగరంలోని 32 డివిజన్ ఎస్ ఆర్ ఆర్ తోటలోని మహిళా కమిటీ హాల్ లో సోమవారం స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ-రవి ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్ రమేష్, ఏడీ అశోక్, ట్రైనర్ సబిత, కార్యక్రమ ఇంచార్జి కొండ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్పొరేటర్ పల్లం పద్మా-రవి మాట్లాడుతూ పిల్లల నుంచి మొదలు యూత్, పెద్దల వరకు అందరూ సారీ డిజైన్స్, బ్లౌజ్ డిజైన్ లకు ఆకర్షితులవుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ టైలర్ డిజైనింగ్ రంగంలో రాణిస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రానున్న రోజుల్లో టైలరింగ్ లో మరిన్ని అవకాశాలు రానున్నాయన్నారు. 32వ డివిజన్ మహిళల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆమె ప్రకటించారు.

# మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలి

**సమ్మక్క, సారమ్మలను తీసుకొచ్చే సమయంలో ఇబ్బందులు**

**మేడారంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పూజారుల విజ్ఞప్తి**

**వరంగల్ వాయిస్, మేడారం :** చిలుకలగుట్ట నుంచి శ్రీ సమ్మక్క, కన్నెపల్లి నుంచి శ్రీ సారలమ్మలను తీసుకొచ్చే సమయంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని సమ్మక్క, సారలమ్మ పూజారులు కోరారు. ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ ఆధ్వర్యంలో సోమవారం మేడారం సమ్మక్క, సారమ్మ జాతర ఏర్పాట్లతోపాటు జాతర సజావుగా నిర్వహించడంపై మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో పూజారలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మేడారం జాతరకు సంబంధించిన ప్రధాన పూజారితోపాటు ఇతర పూజారులందరికీ స్వాగతం పలికారు. జాతర ఏర్పాట్లను వివరించారు. పూజారి వైపు నుంచి ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క, శ్రీ సారలమ్మ, శ్రీ గోవిందరాజులు, శ్రీ పడిగిద్దరాజుల పూజారులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత గదులు కేటాయించాలని కోరారు. అదే విధంగా ఆలయానికి కేటాయించిన స్థలంలోనే శాశ్వత అభివృద్ధి పనులు, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇందులో భాగంగా ప్రధాన పూజారి, ఇతర ఆలయ పూజారులు నివేదిస్తూ ఎండోమెంట్ క్యాడర్‌ను సహాయ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, కొండాయి నుంచి శ్రీ గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా శ్రీ పెద్దిగిద్దరాజులను తీసుకురావడానికి డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో రోప్ పార్టీతో పోలీసు భద్రత ఏర్పాటు చేయలన్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారి మాట్లాడుతు, అన్ని సమస్యలను గుర్తించడం జరిగిందని, పూజారులందరూ సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (జి) జె.వసంతరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎం.రాజ్‌కుమార్, ప్రధాన పూజారి ఎస్.జగ్గారావు, ఇతర పూజారులు వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ప్రభాకర్, నర్సింగరావు, బోజారావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణ చందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితతగతిన సమస్యల పరిష్కారం

**ప్రజావాణిలో కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్ జి ఫిర్యాదులను స్వీకరించారు.

## వరంగల్‌లో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అధికారులకు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని థానాజి వాకడే ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తాణాజి వాకడే, ఆర్డీవో వాసు చంద్ర, నర్సంపేట ఆర్డీవో కృష్ణా వేణి, డీఆర్డీఓ పీడీ సంపత్ రావు, జడ్పీ సీఈవో రాం రెడ్డిలతో కలసి ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో 21 శాఖలకు సంబంధించి మొత్తం 103 దరఖాస్తులు రాగా రెవెన్యూ 47, జీడబ్ల్యూఎంసీకి చెందిన 13 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

## బల్దియాలో ప్రజావాణి..

సోమవారం గ్రీవెన్స్‌ను పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హల్ లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్.ఈ లు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ ఓ శంకర్ లింగం, హెచ్ ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, టీపీఆర్ ఓ రాజేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com